“అది నేను చెప్పలేను. అక్కడ ఇప్పటికీ ఎందరో మహానుభావులున్నారు. వారికి విద్యలు వచ్చినా ప్రదర్శించరు. వారు ఆత్మపరిశీలన ప్రక్షాళన ద్వారా దైవ మార్గాన్ని అన్వేషించేవారు. లోక కళ్యాణమే కోరుతారు వారు ..... వినాశనాన్ని కాదు” అన్నాడు తిరుపతి.

“నాదొక చిన్న సందేహం” అన్నాడు వరప్రసాదం.

“ఏమిటది?” అడిగాడు తిరుపతి.

“మహదేవ్‌బాబులోని సూక్ష్మ శరీరంలేదని ఎలా చెప్పగలిగారు మీరు?”

దానికాయన చిరునవ్వుతో ఇలా అన్నాడు-

“యోగం ద్వారా!”

అభిరాం, వరప్రసాదం అర్థమవలేదన్నట్టు చూశారు.

“అవును! నేను గత ఇరవై ఏళ్ళుగా కుండలినీ శక్తిని సాధించాలని యోగం చేస్తున్నాను..... ”

“కుండలినీ శక్తి సాధించారా? అడిగాడు ప్రసాదం.

“లేదు! సాధించగలనో లేదో కూడా తెలియదు ..... ”

“యోగం అంటే తపస్సుగదా!” అడిగాడు అభిరాం.

“అటువంటిదే”

“ఎలా చేస్తారు దాన్ని?”

“ప్రతిరోజూ నిద్రపోయేముందు తూర్పు వైపున కానీ ఉత్తరం వైపున కానీ కూర్చుని చెవి రంధ్రాలని చూపుడువేళ్ళతో మూసుకోవాలి. అప్పుడు వచ్చేనాదం ఆలకించుతూ నలభై అయిదు నిమిషాలు ప్రతిదినము చెయ్యాలి. ఇలా నాదం వింటూ అభ్యాసం చేస్తూవుంటే వాయు నిగ్రహం అలవడుతుంది.

సాధన చేసేటపుడు వినిపించే నాదముపై బుద్ధినిల్పి ఆ నాదమును విడువకుండా వినటంవల్ల కుండలినీ శక్తిలో చలనం మొదలవుతుంది.

అది బ్రహ్మనాడిలో ప్రవేశించే కాలంలో ఎన్నో రకాల శబ్దాలు సాధకుడికి విన్పిస్తూ వుంటాయి.

తరువాత కుండలినీ నాడి సుషుమ్నా రంధ్రంలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు పెద్దపెద్ద సముద్ర తరంగాల మోతలు విన్పిస్తాయి. క్రమంగా మేఘాలు ఉరిమినట్లు, భేరీలు మోగినట్లు చండ ప్రచండ శబ్దాలు వినపడటం మొదలవుతుంది.

అయినా సాధకుడు ఆపకుండా సాధన చేసిన పిమ్మట మృదంగములు వాయించినట్లు, శంఖములూదినట్లు, ఘంటానాదములు, కాహళనాదము, వేణుగానము, వీణానాదము, భ్రమర నాదములు మొదలైనవి దేహం మధ్య ప్రదేశమునుంది విన్పిస్తుంటాయి.

అప్పుడు బుద్ధి నిర్మలమై, ఏకాగ్రత పెరుగుతుంది. శరీరము ద్వారా చేయు సమస్త కర్మలు, వాటి ఫలితములు ఈశ్వరార్పణ గావించి జీవితాంతం నిగ్రహముగా వుండి కోరికలని

త్యజించి బుద్ధిని సుఖదు:ఖముల వైపు మళ్ళకుండా సాధనచేస్తూ పోతే కుండలినీ శక్తి వశమవుతుంది.

మానవదేహంలో షట్ చక్రములున్నాయి. అవి మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధ చక్రము, ఆజ్ఞాచక్రము. ఈ చక్రములు సుషుమ్నా నాడియందుంటాయి. ఈ షట్ చక్రములలో కుండలినీ నాడి ప్రవేశిస్తున్నప్పుడు ఒక్కోరకం అనుభూతి ఎదురవుతుంది.

సుషుమ్నా నాడి అంటే ప్రాణశక్తి సంచరించేందుకు అడ్డులేని రాజబాటని అంటారు. కుండలినీ ఇంకా ముందుకు సాగిపోతే సాధకుడికి అన్ని భయాలు తొలగిపోతాయి. మానసికంగా, శారీరకంగా బలవంతుడవుతాడు ..... ఆ అనుభూతి పొందితే దానిని బ్రహ్మనాడిలో కుండలినీ ప్రవేశించడంగా చెప్పుకోవచ్చు. ఇలా కుండలినీ శక్తి చలిస్తూ సాధకుడిని మహిమాన్వితుడ్ని చేస్తుంది. యోగులు ఆ మహిమల్ని అష్టయిశ్వర్యములు లేదా అష్టవిధ శక్తులని అంటారు.

అవి-- అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశ్వత, వశత్వ శక్తులు!

ఇందాక నేను మహదేవ్ శరీరంలో సూక్ష్మ శరీరం లేదని చెప్పటానికి కారణం నాకొచ్చిన యోగ మహిమే! అయితే నేనింకా ఎంతో సాధిస్తేనే కానీ కుండలినీ శక్తిని పొందినట్టుకాదు. ఆ లెక్కన నా గమ్యాన్ని నేను సగానికి కూడా చేరుకోలేదు. మామూలు మనుషులు చూడలేని సూక్ష్మశరీరాన్ని యోగులు యోగశక్తితో చూడగలరు. ఇది ఒకప్పటి మాట ..... ”

కానీ మానవుడు సాధించక ఎన్నో విజయాల్లో మరొక విజయంగా యోగులు మాత్రమే చూడగలిగిన సూక్ష్మ శరీరాన్ని (తేజోమయ శరీరం) రష్యన్ సైంటిస్టులు ఫోటోలు తీసి చూపించటంలో విజయం సాధించారు ..... ” అని చెప్పాడు తిరుపతి.

అభిరాం, వరప్రసాదం ఆశ్చర్యంగా చూశారతన్ని.

“అవును! మనిషిలోని మరో మనిషివంటి సూక్ష్మ శరీరాన్ని వారు కిర్లియన్ ఫోటోగ్రఫీ ద్వారా ఫోటోలు తీసి, మనదేశంలోని యోగులూ, ఋషులూ ఎప్పుడో కనిపెట్టిన విషయాన్ని వారిప్పుడు కనుక్కొని, మన దేశంలోని మహాత్ములు చెప్పిన విషయాన్ని కట్టుకథలుగా కొట్టిపారేసే కుహనా సైన్స్ మేథావులకి కనువిప్పు కలిగించారు.

1906లో జంతువుల శరీరంలో దాగివున్న వెలుతున్న (Bio Luminscence or Phosphorescence)కిర్లియన్ ఫోటోగ్రఫీ ద్వారా కనుగొన్నారు. ఇది ఎక్స్‌రే లాంటి పరికరం.

తరువాత రకరకాల చెట్లను, ఆకులను ఫోటోలు తీయడం జరిగింది. వాటిలోని ప్రత్యేకించి సూక్ష్మశరీరం అనబడేది కేవలం తేజస్సు మాత్రమే.

అది అన్ని వైపులా నిప్పురవ్వల వంటి కాంతి మెరుపులలో తళతళలాడే స్పష్టమైన

తేజస్సుతో అంచుల చుట్టూ కన్పించింది.

ఆ తరువాత వారు కొన్ని చెట్ల ఆకులను కత్తిరించి మళ్ళీ ఫోటోలు తీయగా కత్తిరించిన ఆకుభాగం కూడా పూర్తిగా కిర్లియన్ ఫోటోలు కనపడింది. అంటే ఆ ఫోటోలు పడింది ఆకుయొక్క 'ప్రేతాత్మ' (Ghost) లేదా 'జీవాత్మ' (Plasma Body) అన్నమాట.

అందుకే దాంట్లో కొంత కత్తిరించాక కూడా అది సరిగ్గా ఆ పూర్తి ఆకు యొక్క 'స్థూల శరీరాన్ని' పోలి వుంది. అంటే సూక్ష్మశరీరం. కవలల్లా వుంటాయన్నమాట.

స్థూల శరీరంలో మనిషికి ఒక వేలు కానీ, కాలుగాని ఆపరేషన్ చేసి తీసివేసిన తర్వాత కిర్లియన్ ఫోటోగ్రఫీ ద్వారా ఫోటో తీసి చూస్తే సూక్ష్మశరీరంలో మాత్రం తీసేసిన వేలుగానీ, కాలుగానీ అలాగే వుంటుంది. స్థూల శరీరంలో దాగి వుండే సూక్ష్మ శరీరం ప్లాస్మావంటి ప్రాథమిక పదార్థం (Elementary Matter) ఇంకొక సూక్ష్మ శక్తితో కలసి ఏర్పడిన పొగవంటి తేజస్సు. ఇది ఆకాశంలోని నక్షత్రాల మేఘం (Star cloud) లాగా కనబడుతోంది.

ఈ సూక్ష్మశరీరం ఎలక్ట్రానుల వంటి కణాలతో లేక రేణువులతో తయారయిన స్పష్టమైన (Independent entity) శక్తిగా రుజువైంది. అంతేకాదు! ఇది నిరాధారంగా పొగమంచులా ఏర్పడ్డ శక్తి కాదు. స్పష్టంగా ఆకారంలో వున్న ఒక జీవంగానూ, అన్ని పనులూ నిర్వహించగల ఒక వ్యక్తిత్వాన్ని కలిగి వున్నది.

దాంతో హిందుమత స్థాపకులైన ఋషులు లక్షలవేల ఏళ్ళనాడే కనుక్కున్న 'సూక్ష్మశరీరం' 'అంతరాత్మ' అనేవే లేవనే నాస్తికులకి పునాదులు కదిలిపోయాయ్. ఇప్పుడు మీ ఊహకందని సత్యాన్ని మీ కళ్ళముందే ఆవిష్కరిస్తాను" అంటూ లేచాడు తిరుపతి.

అభిరాం, వరప్రసాదం అతనేం చేయబోతున్నాడోనని ఆశ్చర్యంగా చూడసాగారు.

తన సూట్‌కేస్‌లోంచి వీడియో కెమెరాలాంటి దాన్ని బయటకు తీశాడతను.

మడిచివున్న పైపుల్లాంటి గొట్టాల్ని కొన్నింటిని తీసుకుని వాటి మడతలని విప్పి నేలపై పెట్టారు. అప్పుడొక స్టాండ్ రూపాన్ని సంతరించుకుంది. ఆ స్టాండ్‌మీద కెమెరాని అమర్చాడు.

"ఇది కిర్లియన్ దంపతులు కనిపెట్టిన స్పెషల్ కెమెరా నుంచి ఎంతో పరిణామం చెందిన ఆధునిక కిర్లియన్ కెమెరా.

అభిరాం మీరిటురండి. వరప్రసాదంగారూ మీరు లేచి నిలబడండి" అన్నాడు. అభిరాం అతన్ని సమీపించాడు. వరప్రసాదం లేచి నిలబడ్డాడు.

లెన్స్ సరిచేస్తున్నట్లు కెమెరా ముందు భాగంలో ఉన్న గుండ్రని చక్రాన్ని తిప్పుతూ దానిలోంచి వరప్రసాదాన్ని కాసేపు చూశాడు.

తరువాత తలెత్తి - "అభిరాం! మీరీ హాల్‌నుంచి వరప్రసాదంగారిని చూడండి"అన్నాడు.

అభిరాం అతను చెప్పినట్లే చేశాడు.

ఆశ్చర్యం! సృష్టి లయల స్థితికారుడైన భగవంతుడు నేర్పరితనంతో సృష్టించిన మనిషిలో మనిషి ..... అదే సూక్ష్మశరీరాన్ని పట్టి చూపిస్తుందా కెమెరా. ఆ సూక్ష్మశరీరం ప్రసరిస్తున్న కాంతి కిరణాలు కెమెరా అద్దంలో పడి తిరిగి పరావర్తనం చెందుతున్న విషయం స్పష్టంగా కన్పిస్తోంది.

బొటనవేలి ప్రమాణంలో వుండే సూక్ష్మశరీరాన్ని పెద్దదిగా చూపిస్తుందా కెమెరా. మనిషిలాగే అన్ని అవయవాలతో, మెరుపులీనుతూ వుందది.

"మీరిప్పుడు చూసింది వరప్రసాదంగారి సూక్ష్మశరీరాన్ని. ఎలా వుందది?" ప్రశ్నించాడు తిరుపతి.

ఆ మాటలకు వరప్రసాదంలో ఇదీ అని చెప్పలేని ఉత్సుకత ప్రవేశించి, అభిరాం ఏం చెబుతాడోనని ఎదురుచూడసాగాడతను.

"మనిషిలాగే వుంది. అన్ని అవయవాలతో, మెరుపులీనుతూ ..... ఒక తేజస్సులా కనిపించింది."

తను చూసింది చూసినట్లు చెప్పాడు అభిరాం.

"గుడ్! ఇప్పుడు మీరు వెళ్ళి వరప్రసాదంగారు నిలబడిన ప్రదేశంలో నిలబడండి! వరప్రసాదంగారూ! మీరొచ్చి ఈ కెమెరాలోంచి అభిరాంగారిని చూడండి" అన్నాడు తిరుపతి.

ఇద్దరూ తిరుపతి చెప్పినట్లుగానే చేశారు.

"కనిపిస్తుందా?" వరప్రసాదాన్ని అడిగాడు.

కనిపిస్తుంది-అన్నట్లు తలూపాడతను.

"ఎలా వుంది?"

"మనిషిలో మరో మనిషిలా!"

"మంచిది" అని కెమెరాని స్టాండ్‌లోంచి తీసి మహదేవ్‌వైపు తిప్పి దానిలోంచి అతన్ని చూశాడు తిరుపతి కొన్ని క్షణాలు.

"ప్చ్!" అంటూ నిట్టూర్చాడు.

అభిరాం, వరప్రసాదం ఆత్రంగా చూడసాగారు.

"అభిరాం! మీరు మహదేవ్‌వైపు ఈ కెమెరాలోంచి చూడండి" అంటూ ఆ కెమెరాని అతని చేతికందించాడు తిరుపతి. అతని చేతిలోంచి ఆ కెమెరాని తీసుకుని మహదేవ్ వంక చూశాడు అభిరాం.

ఇందాక వరప్రసాదం శరీరంలో కనిపించినటువంటి మరో శరీరంకానీ, వెలుగు కానీ కనిపించలేదు అతనికి. పసుపుపచ్చగా, ఎర్రగా ఏవో కణాలూ, పోగుల్లాంటివి తప్ప!

"ఏం కనిపిస్తుంది?" అడిగాడు తిరుపతి.

"పసుపుపచ్చని రంగులోనూ, ఎర్రని రంగులోనూ ఏవో కదులుతూ కన్పిస్తున్నాయి."

"ఒక ఆకారం ..... అంటే మనిషిలాంటిది కనిపిస్తుందా?" అనడిగాడు తిరుపతి.

"లేదు" అన్నాడు అభిరాం.

"సరే! కెమెరా ఇటివ్వండి" అని అభిరాం చేతిలోంచి కెమెరా తీసుకుని వరప్రసాదానికిచ్చి మహదేవ్ వైపు చూడమన్నాడు తిరుపతి.

వరప్రసాదం అలాగే చేశాడు.

అతనికీ ఏమీ కనిపించలేదు. అభిరాంకి కన్పించిన దృశ్యంలాంటిదే కనిపించింది!

"మీకేం కన్పించింది?" అడిగాడు తిరుపతి.

అభిరాం చెప్పినట్టే చెప్పాడతను.

"అంటే అతని శరీరంలో సూక్ష్మశరీరం లేదని అర్థం. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో ఏవో కదులుతున్నట్టు కనిపించినవి అణువులు, పరమాణువులు (Matter). ఇవి సూక్ష్మ శరీరం కలిగి వున్న పదార్థమయం. అంటే రక్త, మాంసాలు, జీవకణాలు ( Tissues) మొదలైనవన్నమాట.

అదే ప్రదేశంలో కనిపించవలసిన సూక్ష్మశరీరం ఎందుకు కనిపించటంలేదు? దానిక్కారణం ఇందాక వివరించాను నేను. ఈ కెమెరా వల్ల మీకా సంగతి నిర్థారణ అయిందిప్పుడు" అన్నాడు తిరుపతి.

చీమ చిటుక్కుమంటే విన్పించేటంత నిశ్శబ్దం ఆవహించిందక్కడ. ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ తిరిగి మాట్లాడసాగాడు తిరుపతి.

"మహదేవ్ స్థూల శరీరంలో సూక్ష్మ శరీరం లేదుకదా! అయితే అతను చనిపోయినట్టా లేక బతికివున్నట్టా! అన్న అనుమానం సహజంగా ఎవరికైనా కలుగుతుంది. దానికి జవాబు ఒక్కటే!

స్థూలదేహాన్ని వీడి సూక్ష్మ శరీరం ఈ అనంతవిశ్వంలో ఎక్కడికి పోయినా స్థూల శరీరం మరణించదు. కేవలం చైతన్యరహితమై, సుషుప్తావస్థలో వుండిపోతుంది.

దీనికి మంచి వుదాహరణ! మనం నిద్రపోయిన తర్వాత మనకి తెలియని ప్రదేశాలలో సంచరిస్తూ, ఇదివరకూ మనకి పరిచయం లేనివారితో మాట్లాడుతూ ఎక్కడెక్కడో సంచరించి వస్తాం.

ఉదయం లేచిన తర్వాత మనకి కలలోని ఆ సంఘటనలు అన్నీ కాకపోయినా కొన్నయినా గుర్తువచ్చి ఆలోచింపజేస్తాయి.

దీనికి కారణం ఒక్కటే! మనం నిద్రలోకి అంటే అచేతన స్థితిలోకి వెళ్ళిపోయాక సూక్ష్మశరీరం లోకసంచారం చేస్తుంది.

అంతమాత్రాన మనం చనిపోవటం లేదు కదా! అలాగే సూక్ష్మ శరీరాన్ని కోల్పోయిన మహదేవ్ కూడా చనిపోలేదు.

కానీ అతనికి జీవచైతన్యం రావాలన్నా, అతనికి వైద్యులు చేస్తున్న వైద్యంవల్ల స్వస్థత చేకూరాలన్నా అతని స్థూల శరీరంలోకి సూక్ష్మశరీరం వచ్చి తీరాలి.

ఈ విషయాన్ని కూడా రష్యన్ సైంటిస్ట్ డాక్టర్ భిజేవిస్కి తన పరిశోధనల ద్వారా రుజువుచేశాడు.